RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...

సంపుటి - 1 సంచిక - 187 శనివారం 13 జూలై 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts

WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.

ఎడిటర్ : బిర్రు కరుణాకర్

Cell: 9701249103



కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ అయినా జైల్లోనే

4లో.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ కవల పిల్లలు



- బిజెపి విస్తృతస్థాయి సమావేశంలో కిషన్ రెడ్డి విమర్శలు
- గాంధీ భవన్, తెలంగాణ భవన్ లు రెండు ఒక్కటే
- తప్పుడు ప్రచారంతోనే కాంగ్రెస్ కు అధికారం
- ఈ ఏడు నెలల్లో రేవంత్ చేసింది గుండు సున్నా
- పార్టీ పిరాయింపులు ఢిల్లీకి డబ్బు పంపుడు
- ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పని

2 లో

# 16 న సిఎం హై లెవెల్ మీటింగ్



- ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షకు ఏర్పాట్లు
- 16న జరిగే సమావేశానికి రావాలని ఆదేశాలు జారీ
- హాజరుకానున్న జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు
- ఎజెండా విడుదల చేసిన ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి

**హైదరాబాద్ జులై 12,(జర్నలిస్ట్ వార్త):** సిఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈనెల 16న సచివాలయంలో కీలక సమావేశం జరగనుంది. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో నిర్వహించే రాష్ట్రస్థాయి కాన్ఫరెన్స్‌లో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. దీనికి సంబంధించిన అజెండాను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి ఖరారు చేశారు. మొత్తం 9 అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. వాటికి సంబంధించిన వివరాలతో హాజరుకావాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లను సీఎస్ ఆదేశించారు.



## అజెండాలోని అంశాలివే..

| | |
|---|---|
| ప్రజాపాలన | మహిళా శక్తి |
| ధరణి ,వ్యవసాయం | విద్య |
| ఆరోగ్యం- సీజనల్ వ్యాధులు | శాంతిభద్రతలు |
| వన మహోత్సవం | డ్రగ్స్ నిర్మూలన క్యాంపెయిన్ |



2లో.

## గోపన్ పల్లి ఫ్లై ఓవర్ ప్రారంభించండి

- పూర్తి అయినా ప్రారంభానికి నోచుకోని వైనం
- ఎత్తి చూపిన మాజీ మంత్రి కెటిఆర్
- ఎప్పుడు ప్రారంభిస్తారంటూ నిలదీత .
- ఢిల్లీ చక్కర్లు ఆపి ప్రజా సమస్యలపై
- శ్రద్ద పెట్టాలంటూ చురకలు ..

## జూన్ 25 ‘ రాజ్యాంగ హత్యా దినం’

- ఎక్స్ వేదికగా ప్రకటించిన కేంద్రమంత్రి అమిత్ షా
- ఎమర్జెన్సీని విధించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని హత్య చేశారన్న కేంద్రమంత్రి
- ప్రజాస్వామ్యం గొంతును, మీడియా గొంతును నొక్కేశారన్న అమిత్ షా

2లో.

# నైనీ వద్ద బొగ్గు గనుల తవ్వకానికి సింగరేణికి సహకరిస్తాం

: భట్టి విక్రమార్కకు ఒడిశా సీఎం హామీ

- సింగరేణికి బొగ్గు గనుల ఆవశ్యకతను వివరించిన భట్టివిక్రమార్క
- 2017లోనే నైనీ గనులను సింగరేణికి కేటాయించినట్లు వెల్లడి
- అటవీ, ప్రైవేటు భూముల అంశం పరిష్కరించాలని విజ్ఞప్తి



2లో.



2లో.

## కాంగ్రెస్ పార్టీలో బిఆర్ఎస్ విలీనం తథ్యం

ఎమ్మెల్యే దానం నాగేందర్ జోస్యం

- ఈ రోజు ఒకరు, రేపు మరొకరు
- మరో వారంలో మరో నలుగురు
- కారు పార్టీలో కేవలం ఉండేది నలుగురు
- భవిష్యత్ అంతా కాంగ్రెస్ దే..
- కేసీఆర్ పార్టీ ఖేల్ ఖతం.. దుకాణం బంద్

# మోదీ ప్రధానిగా ఉన్నన్ని రోజులు రిజర్వేషన్లకు ఢోకా లేదు

: కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే సామాన్యుడే ముఖ్యమంత్రి అవుతారని వ్యాఖ్య



**హైదరాబాద్ జులై 12,(జర్నలిస్ట్ వార్త):** నరేంద్రమోదీ ప్రధానిగా ఉన్నన్ని రోజులు రిజర్వేషన్లకు ఎలాంటి ఢోకా ఉండదని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. శంషాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర బీజేపీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ రాజ్యాంగాన్ని తరచూ అవమానపరుస్తోందన్నారు. ఎన్డీఏ అధికారంలో ఉన్నన్ని రోజులు రాజ్యాంగాన్ని మార్చే ప్రసక్తి లేదన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం హిందూ విరోధి అని ఆరోపించారు.ప్రత్యేక తెలంగాణ కోసం బీజేపీ మద్దతిచ్చిందని గుర్తు చేశారు. బీజేపీలో సామాన్య కార్యకర్త ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే సామాన్యుడే ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. బీజేపీలో చేరిన వారంతా పాత నాయకులే అన్నారు. ఈటల రాజేందర్ పార్టీలో కొత్త నాయకుడు కాదని... ఆయన పాత నేత అయిపోయారన్నారు. దక్షిణ భారతంలో బీజేపీ బలపడిందన్నారు. తెలంగాణ, ఏపీలలో గతంలో కంటే మంచి సీట్లు గెలుచుకున్నామని, కేరళలో బీజేపీ ఖాతా తెరిచిందని, తమిళనాడులో మెరుగైన ఓటు బ్యాంక్ సాధించామన్నారు. తెలంగాణలో బీజేపీని నెంబర్ వన్ పార్టీగా మార్చేందుకు తమ వద్ద 1500 రోజుల ప్రణాళిక ఉందని తెలిపారు. రాష్ట్రంలో పోలింగ్ బూత్ లెవెల్‌లో బీజేపీని మరింత బలపర్చాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలో కొత్త, పాత అన్నది లేదని తేల్చి చెప్పారు.గత పదేళ్లుగా ఒక కుటుంబం తెలంగాణ రాష్ట్రాన్ని నాశనం చేసిందని మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్-బీఆర్ఎస్‌లకు నిద్ర పట్టకుండా చేస్తేనే బీజేపీ ఫస్ట్ స్థానంలోకి వస్తుందని సమావేశానికి హాజరైన నేతలను ఉద్దేశించి పిలుపునిచ్చారు. ఊర్లో ఉన్న ప్రతి సమస్యను బీజేపీ కార్యకర్త సామరస్యంగా పరిష్కరించాలని సూచించారు. టాప్ 5 ఎకనామిక్ సిటీస్‌లో హైదరాబాద్ ఉందన్నారు.

## కవిత డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

విచారణను జులై 22కు వాయిదా వేసిన ట్రయల్ కోర్టు




**ఢిల్లీ జులై 12,(జర్నలిస్ట్ వార్త):** మద్యం పాలసీ కేసులో తనకు డిఫాల్ట్ బెయిల్ ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టు విచారణను వాయిదా వేసింది. కేసులో కవిత పాత్రపై సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకునే అంశం, సీబీఐ కేసులో డిఫాల్ట్ బెయిల్ ఇచ్చే పిటిషన్‌పై విచారణను జులై 22కు వాయిదా వేసింది.

ఈ మేరకు ట్రయల్ కోర్టు జడ్జి కావేరి భవేజా తెలిపారు. సీబీఐ ఛార్జిషీట్‌లో తప్పులు ఉన్నాయని కవిత తరపున సీనియర్ న్యాయవాది నితీశ్ రాణా వాదనలు వినిపించారు. ఛార్జిషీట్‌లో ఎలాంటి తప్పులు లేవని సీబీఐ తరఫు న్యాయవాది పేర్కొన్నారు.

# నైనీ వద్ద బొగ్గు గనుల తవ్వకానికి సింగరేణికి సహకరిస్తాం

**హైదరాబాద్ జులై 12,(జర్నలిస్ట్ వార్త):**
నైనీ వద్ద బొగ్గు గనుల తవ్వకానికి పూర్తిస్థాయిలో సహకరిస్తామని ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాంఝీ తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు హామీ ఇచ్చారు. శుక్రవారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని భట్టివిక్రమార్క ఒడిశాలోని సేవా భవన్‌లో కలిశారు. ఒడిశాలోని నైనీ వద్ద సింగరేణి సంస్థ చేపట్టిన బొగ్గు గని ప్రాజెక్టులో తవ్వకాలు చేపట్టేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆ రాష్ట్ర సీఎం సానుకూలంగా స్పందించారు.
నైనీ బ్లాక్‌లో సింగరేణి కార్యకలాపాల ప్రారంభానికి సంబంధించి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని కోరడానికి అధికారుల బృందంతో కలిసి భట్టివిక్రమార్క ఒడిశా ముఖ్యమంత్రిని కలిశారు. బొగ్గు గనుల తవ్వకానికి సహకరిస్తానని హామీ ఇచ్చిన మోహన్ చరణ్... ఆ దిశగా తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.
సింగరేణికి బొగ్గు గనుల ఆవశ్యకతను భట్టివిక్రమార్క వివరించారు. 2017లోనే నైనీ గనులను సింగరేణికి కేటాయించినట్లు తెలిపారు. నైనీ బ్లాక్‌లో తవ్వకాలకు సంబంధించి పర్యావరణ, పారిశ్రామిక అనుమతులు వచ్చినట్లు సీఎంకు తెలిపారు. అటవీ, ప్రైవేటు భూములను సింగరేణికి బదలాయించాల్సిన అంశం మాత్రం పెండింగ్‌లో ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారమైతే సింగరేణి అక్కడ తవ్వకాలను ప్రారంభిస్తుందన్నారు.
నైనీ బ్లాక్‌లో తవ్వకాలు చేపడితే ఒడిశా యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి లభిస్తుందని, పన్నుల రూపంలో రూ.600 కోట్ల వరకు ఒడిశా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని వివరించారు. ఈ క్రమంలో భూముల బదలాయింపు, విద్యుత్, రోడ్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ అంశాలను పరిష్కరించాలని ఒడిశా సీఎం కూడా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# గోపన్ పల్లి ప్లై ఓవర్ ప్రారంభించండి

**హైదరాబాద్ జులై 12,(జర్నలిస్ట్ వార్త):**
గోపన్ పల్లి ప్లై ఓవర్ నిర్మాణం పూర్తైన ప్రారంభించకపోవటంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో నేడు ట్విట్ చేశారు.. సీఎం కు ఢిల్లీకి చక్కర్లు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టు తిరగటం ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదా? అంటూ నిలదీశారు.. వెంటనే గోపన్ పల్లి ప్లై ఓవర్ ను ప్రారంభించాలని, లేదంటే ప్రజలే ప్రారంభించే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే నిర్మాణం పూర్తిహైదరాబాద్ లోని గోపన్ పల్లి ప్లై ఓవర్ ను బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు నిర్మాణం పూర్తి చేసిందన్నారు కెటిఆర్ . ఈ ప్లై ఓవర్ అందుబాటులోకి వస్తే నల్లగండ్ల, గోపన్‌పల్లి, తెల్లాపూర్, చందానగర్ వాసులకు ట్రాఫిక్ కష్టాలు తగ్గుతాయని వివరించారు. అందుకోసం బీఆర్ఎస్ ప్రభుత్వం వేగంగా ఈ ప్లై ఓవర్ నిర్మాణాన్ని పూర్తి చేసిందంటూ . కానీ ఇప్పటికీ ఈ ప్లై ఓవర్ ను ప్రారంభించకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. . ప్రజల సమస్యలపై అవగాహన లేని అసమర్థ ప్రభుత్వం, నాయకత్వం ఉన్నప్పుడే ఇలాంటి పరిస్థితి వస్తుందని అసహనం వ్యక్తం చేశారు.గోపన్ పల్లి ప్లై ఓవర్ ను ప్రారంభించేందుకు సీఎం సమయం లేకుండా పోయిందని,. ఎందుకంటే ఆయన ఢిల్లీ చుట్టు షటిల్ సర్వీస్ లు చేయటానికి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఇళ్ల చుట్టు తిరగటంలోనే బిజీగా ఉన్నారంటూ సెటైర్ వేశారు కెటిఆర్. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యల కన్నా కూడా వ్యక్తిగత ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇస్తుందని విమర్శించారు. వెంటనే గోపన్ పల్లి ప్లై ఓవర్ ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

# సీఈవో గా బాధ్యతలు స్వీకరించిన సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్ జులై 12,(జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా సుదర్శన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.. ఇంతకాలం ఆ పదవిలో ఉన్న వికాస్‌రాజ్ ఆ బాధ్యతలను సుదర్శన్‌రెడ్డి అప్పగించారు.. దీంతో సుదర్శన్ రెడ్డి చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. సీఈవో గా బాధ్యతలు స్వీకరించిన సుదర్శన్ రెడ్డి గతంలో రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)లో సర్వీసెస్, హ్యూమన్ రిసోర్స్ సర్వీసెస్ సెక్రెటరీగా విధులు నిర్వహించారు. దీనికి ముందు హైదరాబాద్ మెట్రో వాటర్ సర్వీసు



మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. గతంలో రాష్ట్ర సర్వీసులో ఉన్న వికాస్‌రాజ్ 2022 మార్చిలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా బాధ్యతలు చేపట్టారు

# ఎమర్జెన్సీ విధించిన జూన్ 25ను 'రాజ్యాంగ హత్యా దినం' గా ప్రకటించిన కేంద్రం

**ఢిల్లీ జులై 12,(జర్నలిస్ట్ వార్త):**
కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 25ను రాజ్యాంగ హత్యా దినంగా ప్రకటించింది. 1975 జూన్ 25న ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని ప్రకటించారు. కేంద్రమంత్రి అమిత్ షా ఎక్స్ వేదికగా కేంద్రం నిర్ణయాన్ని ప్రకటించారు. ఎమర్జెన్సీని విధించడం ద్వారా ప్రజాస్వామ్య ఆత్మను హత్య చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎమర్జెన్సీ సమయంలో లక్షల మందిని జైళ్లలో పెట్టారన్నారు. ఎమర్జెన్సీ సమయంలో మీడియా గొంతు కూడా



నొక్కారన్నారు. ఎమర్జెన్సీ చీకటి రోజుల నాటి అమానవీయ హింసను భరించిన వారందరికీ ప్రతి సంవత్సరం ఆ రోజు నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు.1975 జూన్ 25న ఇందిరాగాంధీ తన నియంతృత్వ పాలనతో దేశంలో అత్యయికస్థితిని విధించి ప్రజాస్వామ్యం గొంతును నులిమేశారన్నారు. కారణం లేకుండానే లక్షలాది మందిని జైల్లో పెట్టారన్నారు. ఆ చీకటి రోజులకు నిరసనగా ఇక నుంచి ప్రతి సంవత్సరం రాజ్యాంగ హత్యా దినంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ కవల పిల్లలు

## బిజెపి విస్తృతస్థాయి సమావేశంలో కిషన్ రెడ్డి విమర్శలు

**శంషాబాద్ జులై 12,(జర్నలిస్ట్ వార్త):**
గాంధీ భవన్‌కు, తెలంగాణ భవన్‌కు తేడా లేదని కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు కేంద్ర మంత్రి, రాష్ట్ర బిజెపి చీఫ్ కిషన్ రెడ్డి . శంషాబాద్‌లోనేడు జరిగిన తెలంగాణ రాష్ట్ర బిజెపి విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, : కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీ లు కవల పిల్లలు.. తో బొట్టువులని.. కాంగ్రెస్ గెలిస్తే బీఆర్ఎస్ లో చేరుతారు.. బీఆర్ఎస్ గెలిస్తే కాంగ్రెస్ లో చేరుతారని ఎద్దేవా చేశారు.



కెసిఆర్ పాలనలో వందలాది మంది కార్యకర్తలు జైలు కు వెళ్ళారని, అనేకమందిపై అక్రమ కేసులు పెట్టారన్నారు. అయినప్పటికీ మొక్కవోని దీక్షతో 10 సంవత్సరాలు కెసిఆర్ ప్రభుత్వం మీద పోరాటం చేశామన్నారు. రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్ గిరి లో, రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే గా ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంట్ స్థానం నుండి బీజేపీ గెలిచిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ,బీఆర్ఎస్ ఒకటే ననే కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమలు కానీ హామీలు ఇచ్చి మభ్య పెట్టిందన్నారు.
పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అమిత్ షా వీడియో ను మార్ఫింగ్ చేసిందని %ౌ% రిజర్వేషన్ లు ఎత్తేస్తారని దుష్ప్రచారం చేసి లబ్దిపొందిందని విరుచుకుపడ్డారు కిషన్ రెడ్డి . పార్లమెంట్ ఎన్నికలలో తెలంగాణలో బీజేపీ విజయం సాధారణం కాదన్నారు. బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవలేదన్నారు. అసెంబ్లీ లుగా చూస్తే బీజేపీ 46 స్థానాల్లో మొదటి స్థానం వస్తే బీఆర్ఎస్ కేవలం 3 స్థానాల్లో మొదటి స్థానం వచ్చిందన్నారు. కాంగ్రెస్ అతి తక్కువ కాలం లోనే ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. ఏ ఒక్క గ్యారంటీ నీ కూడా పూర్తిగా అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం లో ఎక్కడ చూసినా ఆందోళనలు , నిరసనలు జరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఫిరాయింపులకు పాల్పడుతోందని మండిపడ్డారు.
రాజకీయ ఫిరాయింపులు, తెలంగాణ ను దోచుకొని డిల్లీకి పంపించడం ఈ రెండు పనులు మాత్రమే కాంగ్రెస్ చేస్తుందన్నారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టో లో పార్టీ మారితే అనర్హత వేటు వేస్తానని పాంచ్ న్యాయ పేరుతో పెట్టిందన్నారు. నిస్సిగ్గుగా, అనైతికంగా చట్ట వ్యతిరేకంగా ఫిరాయింపుకి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని ప్రతి రోజూ రేవంత్ రెడ్డి నడి రోడ్డు మీద అవహేళన చేస్తున్నారన్నారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ వేర్వేరు కాదని , భవిష్యత్ లో ఆరెండు పార్టీలు కలుస్తాయన్నారు. పొత్తు, గిత్తు ఉంటే ఆ రెండు పార్టీ ల మధ్యనే అన్నారు. రెండు పార్టీ లు అవినీతి పార్టీ లే అన్నారు. బీజేపీ తెలంగాణ ప్రజలతో ఉంటుందన్నారు. ఈ రాష్ట్రం లో మార్పు రావాలి అంటే, తెలంగాణ అభివృద్ధి చెందాలి అంటే, అమర వీరుల ఆకాంక్షలు నెరవేరాలంటే బీజేపీ మాత్రమే అధికారంలోకి రావాలన్నారు.%ఏడు నెలలో ఒక్క బెల్ట్ షాప్ ను కూడా తొలగించలేదు రేవంత్ రెడ్డి అంటూ మండిపడ్డారు. ఈ ప్రభుత్వం కి దిశ దశ లేదన్నారు. భూములు, మద్యం అమ్మడం, అప్పులు తేవడం అన్నారు. బీఆర్ఎస్, మజ్లిస్ తో కుమ్మక్కు అయినట్టే కాంగ్రెస్ మజ్లిస్ తో కుమ్మక్కు అయిందన్నారు. మజ్లిస్ కనుసన్నల్లో నే ఈ రెండు పార్టీ లు పని చేస్తాయన్నారు. తెలంగాణ ను వ్యతిరేకించిన మజ్లిస్ తో కాంగ్రెస్, బీఆర్ఎస్ లు అంట కాగుతున్నాయన్నారు. బీజేపీ నీ విమర్శించే నైతిక హక్కు ఈ పార్టీలకి లేదన్నారు. తెలంగాణకు అన్యాయం జరిగితే దానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ లే బాధ్యత వహించాలన్నారు. ఎంఐఎం సభ్యుడు పాలస్తీనా కి జై కొట్టారని, ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు సిగ్గుండాలన్నారు.
ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హాజరు కాగా రాష్ట్రానికి చెందిన మరో కేంద్రమంత్రి బండి సంజయ్, ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో బిఆర్ఎస్ విలీనం తథ్యం

## ఎమ్మెల్యే దానం నాగేందర్ జోస్యం

**హైదరాబాద్ జులై 12,(జర్నలిస్ట్ వార్త):**
అతి త్వరలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అవుతున్నారని.. ఆ తర్వాత బీఆర్ఎస్ ఎల్పీ (బీఆర్ఎస్ లెజిస్లేటివ్) పార్టీ.. అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ పార్టీలో విలీనం అవుతుందని సంచలన కామెంట్స్ చేశారు ఎమ్మెల్యే దానం నాగేందర్. హైదరాబాద్ సిటీలో నేడు జరిగిన షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ%ౌ% బీఆర్ఎస్ పార్టీలో కేవలం నలుగురు ఎమ్మెల్యేలు మాత్రమే మిగులుతారని.. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, పల్లా మాత్రమే ఉంటారని.. మిగతా ఎమ్మెల్యేలు అందరూ కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అవుతున్నారని స్పష్టం చేశారాయన.
%ఇదే సందర్భంలో కేసీఆర్ వ్యవహార శైలినీ తప్పుబట్టారు దానం. కనీసం ఎమ్మెల్యేలకు అపాయింట్ మెంట్ కూడా ఇవ్వరని.. ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉండరని.. ఎప్పుడూ ఫాంహౌస్ లోనే ఉంటారంటూ చురకలు అంటించారు దానం. ఒకవేళ అపాయింట్ మెంట్ ఇచ్చినా.. గంటల తరబడి కేసీఆర్ కోసం వెయిట్ చేయాలని.. బీఆర్ఎస్ పార్టీలో స్వేచ్ఛలేదన్నారు దానం.%బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు.. కేటీఆర్, అతని అనుచరులు వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని.. ఆ వివరాలు అన్నీ బయట పెడతానని వెల్లడించారాయన. ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకే ఆరు నెలల్లో అధికారంలోకి వస్తామంటూ కేటీఆర్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని.. బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ అధికారంలోకి రాదన్నారు దానం.జైల్లో ఉన్న కవితను బయటకు తీసుకురాకుండా రాజకీయం చేస్తున్నారని.. కావాలనే కవితను జైల్లోనే ఉంచుతున్నారంటూ కేసీఆర్, కేటీఆర్ తీరును ప్రశ్నించారు దానం. అతి త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ మూతపడుతుందని అది ఎంతో దూరంలో లేదని జోస్యం చెప్పారు దానం.

# హైడ్రా విధి విధానాలపై సీఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్ జులై 12,(జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్ సిటీ విస్తరణకు అనుగుణంగా ప్రజలకు విస్తృత సేవలను అందించేలా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) రూపుదిద్దుకోవాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. జాతీయ విపత్తుల నిర్వహణ చట్టానికి అనుగుణంగా ఈ కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. హైడ్రా వ్యవస్థాగత నిర్మాణం, విధి విధానాలపై మరింత అధ్యయనం చేసి కసరత్తు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.
జీహెచ్ఎంసీతో పాటు, హెచ్ఎండిఏ, వాటర్ బోర్డు, విజిలెన్స్, ట్రాఫిక్, విద్యుత్తు, పోలీస్ విభాగాలను సమన్వయం చేసుకొని మరింత సమర్థంగా హైడ్రా పని చేసేలా ఉండాలని అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. ఇప్పుడున్న ఎన్?ఫోర్స్?మెంట్? విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ విభాగాన్ని అందుకు అనుగుణంగా పునర్ వ్యవస్థీకరించాలని ఆదేశించారు.కొత్త విభాగంలో ఏయే స్థాయి అధికారులుండాలి.. ఎంత మంది సిబ్బంది ఉండాలి.. ఏయే విబాగాలపై వీరిని డిప్యుటేషన్పై తీసుకోవాలి.. అనే అంశాలపై స్పష్టమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు.
జీహెచ్ఎంసీతో పాటు హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు వరకు 2 వేల కిలోమీటర్ల పరిధిలో హైడ్రా పని చేయాల్సి ఉంటుందని, పని విభజనకు వీలుగా సిటీలో ఇప్పుడున్న జోన్ల తరహాలో భౌగోళిక పరిధిని



నిర్దేశించాలని సీఎం సూచించారు. అవసరమైతే హైడ్రాకు ప్రత్యేక నిధులు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోగా ముసాయిదా తయారు చేయాలని చెప్పారు.హైడ్రా ఏర్పాటు, సంబంధిత విధివిధానాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సచివాలయంలో సమీక్ష చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ అమ్రాపాలీ, జీహెచ్ఎంసీ ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.
విపత్తుల నిర్వహణతో పాటుగా ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, చెరువులు, నాలాల కబ్జాలకు అడ్డుకట్ట వేయటం, ఆక్రమణలను తొలిగించటం, అక్రమ నిర్మాణాలు, నిబంధనలను పాటించని ఫ్లెక్సీలు, హోర్డింగ్లు, ప్రకటనల తొలిగింపు, ట్రాఫిక్ నిర్వహణ, తాగునీరు, విద్యుత్తు సరఫరాలో హైడ్రా కీలకంగా వ్యవహరించేలా విధులు అప్పగించాలని సీఎం చెప్పారు.హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, డిజాస్టర్ మేనేజ్?మెంట్?, మున్సిపల్ విభాగాల మధ్య ఎప్పటికప్పుడు సమన్వయం ఉండాలని అధికారులను అప్రమత్తం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న అనధికారిక హోర్డింగ్స్, ఫ్లెక్సీలు తొలగింపు, అపరాధ రుసుము వసూలు బాధ్యతను హైడ్రాకు బదలాయించాలని అన్నారు. నాలాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల విషయంలో నిబంధనలు కఠినంగా ఉండేలా అధ్యయనం చేయాలని సూచించారు.

# శాకంభరీ నవరాత్ర మహోత్సవములు ఏడవరోజు



వరంగల్, జులై 12,(జర్నలిస్ట్ వార్త):
వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు ఏడవ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం శ్రీ భద్రకాళీ దేవస్థానం కార్యనిర్వహణాధికారి శేషుభారతి ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపిన ప్రకారం ఆలయంలో నిత్యాహ్నికం పూర్తి చేసిన పిమ్మట అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తిని కాళీ క్రమాన్ని అనుసరించి, విప్రచిత్తా నిత్యా గాను షోడశీ క్రమాన్ని అనుసరించి జ్ఞానశక్తిని మహావజ్రేశ్వరి గాను అంకరించి పూజారాధనలు నిర్వహించారు. ఎంతో పుణ్యం చేసుకుంటే వచ్చింది ఈ మనుష్య జన్మ, పరోపకారార్థమిదం శరీరమని శాస్త్రం చెబుతోంది. పరులకు ఉపకారం చేయాలంటే మన దగ్గర జ్ఞానం, ఐశ్వర్యం, అధికారం లేదా వృత్తి నైపుణ్యం ఈ నాలుగింటిలో ఏదోకటి ప్రధానంగా కలిగియుండాలి. ఈ నాలుగు కూడా నిరంతర సాధన కఠోర పరిశ్రమ చేస్తేనే, సమకూరవు ప్రారబద్ధవశమున అసురీ శక్తులు జీవుడిలో అలసత్వం, బద్ధకం రూపంలో ప్రవేశించి, సాధనా మార్గం నుండి ప్రక్కకు తెప్పిస్తాయన్నారు. తతాయిగా మార్చి మానవ జీవితాన్ని వ్యర్థపరుస్తాయి. మానవ జన్మ సార్థకం కావాలంటే సాధనా సంపత్తి కావాలన్నారు. జీవుడు సాధనలో నిమఘ్నం కావాలంటే ఈ అసురీ శక్తులు దూరం కావాలన్నారు. అందుకు జగన్మాత అనుగ్రహం ఉండాలన్నారు. విప్రచిత్తా అమ్మవారు బ్రాహ్మణుల బుద్ధియందు ప్రవేశించి, బ్రాహ్మణులు వేదోక్త తత్త్వజ్ఞానంతో కూడిన వేదవిహిత కర్మలను ఆచరించే విధంగా చేసి, తద్వారా అగ్నిష్టోమాది శౌతయాగాలు జరుపుచూ, తద్వారా సకల జనులు తరించే విధంగా చేస్తుందని తెలిపారు. మహావజ్రేశ్వరీ మాత సాధకుడి సంకల్పాలను వజ్రసంకల్పంగా ధృడతరం చేసి, మనిషిని సాధనలో కృతకృత్యున్ని చేసి, ఆత్మోద్ధరణ జరుపుతుందని వివరించారు. జగన్మాత ఆరాధన వల్ల జీవుడు తాను తరిస్తూ, పది మందిని తరింపజేస్తాడని చెప్పుకొచ్చారు. ఈ విధంగా లోక కళ్యాణం జరుగుతుందన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**- ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత శ్రీనివాస్ రెడ్డి**



రాయపర్తి, జులై 12,(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండలం మైలారం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఓరుగంటి సారయ్య అనారోగ్యం మృతి చెందారు. శుక్రవారం సమాచారం తెలుసుకున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబాన్ని సందర్శించారు. వారి కుటుంబ సభ్యులకు 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలోని అనేకమంది నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటూ, తన ఫౌండేషన్ ద్వారా ఎన్నోసేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రజాసేవే లక్ష్యంగా తీసుకున్న ఆయన ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ మనోధైర్యాన్ని కల్పిస్తున్నారు. ఆ గ్రామంలో ఎవరు ప్రాణాలు కోల్పోయిన ఆ కుటుంబాన్ని పరామర్శించి తనకు వీలైనంతగా ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేయడం అలవాటుగా మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బిల్లా వెంకట్ రెడ్డి, లేతాకుల సుధాకర్ రెడ్డి, సామాజిక కార్యకర్త కిరణ్ కుమార్ రెడ్డి, ఉలెంగుల యాదగిరి, గడిపెల్లి రాముల, మహేందర్ రెడ్డి, గడిపెల్లి మల్లయ్య, యాకయ్య గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఆకేరు వాగులో పర్యటించిన అధికారులు

- కొండను తవ్వి ఎలుకను పట్టారు - తవ్వకాల మిషనరీలు ఎందుకు పట్టుకోలేదు
- ముందస్తుగా వారికి సమాచారమిచ్చిందెవరు..? - తవ్వకాలు చేసేదెవరు అధికారులకు తెలియదా..?
- వారిపై చర్యలు తీసుకోవడంలో అభ్యంతరమేంటి..? - అవినాభావ సంబంధాలే కారణమా..?



వర్ధన్నపేట, జులై 12,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మండల పరిధిలోని ల్యాబర్తి గ్రామంలో ఇసుక తవ్వకాలు చేస్తున్న సంగతి ప్రతీ ఒక్కరికి తెలిసిన విషయమే. శుక్రవారం వర్ధన్నపేట రెవెన్యూ, పోలీసు అధికారులు ల్యాబర్తి గ్రామానికి కదిలి వెళ్లారు. తవ్వకాలు నిర్వహించే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. తవ్వకాలు చేయడానికి ఉపయోగించే జెసిబి వాహనాలు మాత్రం అధికారుల కంటబడలేదు. తవ్వకాల నిర్వాహకులు సైతం వారికి దొరకలేదు. కేవలం ఇసుకను కొనుగోలు చేసి అమ్ముకుని జీవించే వారి ఆరు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. ఇట్టి విషయమై 2 శాఖలకు సంబంధిత అధికారులు తవ్వకాల స్థలానికి చేరుకొని ఆరు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్ కుమార్ ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తూ, సహజ వనరులను ధ్వంసం చేస్తున్న సంఘటనపై ల్యాబర్తి ఆకేరు వాగు పరిసర ప్రాంతాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. ఇసుకలోడుతో ఉన్న ఆరు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

**తవ్వకాల మిషనరీలు ఎందుకు పట్టుకోలేదు..?**

వర్ధన్నపేట మండల ఎమ్మార్వో విజయ్ సాగర్, ఎస్సై ప్రవీణ్ కుమార్ తమ, తమ సిబ్బందిని వెంటపెట్టుకొని వాగులోకి వెళ్లి కేవలం ఇసుకలోడుతో ఉన్న ఆరు ట్రాక్టర్లను మాత్రమే అదుపులోకి తీసుకోవడమేంటన్న విషయమై చర్చ జరుగుతుంది. అనుమతులు లేని ఇసుకలోడుతో ఉన్న ట్రాక్టర్లు అక్కడే ఉన్నప్పుడు వాటిని లోడ్ చేసిన జెసిబి మిషనరీలు ఎక్కడ పోయాయి. వాటిని ఎందుకు అదుపులోకి తీసుకోలేదన్న విషయమై వాదన జరుగుతోంది. వాగులోకి వెళ్లడానికి ముందే తవ్వకాల నిర్వాహకులకు సమాచారం ఇచ్చిన అధికారులెవరని వాదన జరుగుతోంది. లోడు ట్రాక్టర్లు సంఘటన స్థలంలో కనిపించినప్పుడు జెసిబి మిషనరీలు మాత్రమే ఎలా తప్పించుకుంటాయి..? అంతో ఇంతో అధికారుల ప్రోత్సాహం లేకుండానే తప్పించుకున్నాయా అంటూ విమర్శలు తలెత్తుతున్నాయి.

**తవ్వకాలు చేసేదేవరన్న విషయం అధికారులకు తెలియదా..?**

సంఘటన స్థలాన్ని చేరుకున్న అధికారులు తవ్వకాల స్థలాన్ని పరిశీలించినప్పుడు ఆ స్థలాన్ని అనుభవించే వారు ఎవరన్న విషయం అధికారులకు తెలుస్తుంది. అలాంటప్పుడు వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అధికారుల తీరును స్థానికులు అనుమానిస్తున్నారు. తవ్వకాలు చేస్తున్న భూమి యాజమాని పేరుపై ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలు తక్షణమే రద్దుచేసి, వారికి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న లాభాలను తొలగించి, అట్టి భూములను అన్యాక్రాంతం చేస్తున్న సందర్భంగా రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు సూచిస్తున్నారు.

# 73 మంది మాత్రమే నిర్ధారణ పరీక్షలకు హాజరు



వర్ధన్నపేట, జులై 12,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం సదరం క్యాంపు నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ నరసింహ స్వామి తెలుగును వివరాల ప్రకారం సదరం శిబిరానికి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 104 మంది దివ్యాంగులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అందులో 73 మంది మాత్రమే క్యాంపులో పాల్గొని నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. అర్హులైన దివ్యాంగుల అందరికీ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయం నుండి సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు డిఆర్డిఎ పెన్షన్ విభాగం అధికారులు పేర్కొన్నారు. ఈ సదరం శిబిరంలో వైద్యాధికారులు డాక్టర్ చందు నాయక్, డాక్టర్ వేణు, డాక్టర్ భరత్, డి.ఆర్.డి.ఏ. సదరం విభాగం అధికారులు పరమాత్మ, కిరణ్, శైలజ తదితరులు ఉన్నారు.

# ఉత్తమ విద్య బోధనతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు

**: మండల నోడల్ అధికారి రాపాక సదానందం**



వర్ధన్నపేట, జులై 12,(జర్నలిస్ట్ వార్త): ఉత్తమ విద్య బోధనతోనే ఉపాధ్యాయులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని మండల నోడల్ అధికారి వర్ధన్నపేట ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు రాపాక సదానందం అన్నారు. శుక్రవారం మండలంలోని దమ్మన్నపేట ప్రాథమిక పాఠశాలలో సుధీర్ఘ కాలంగా విధులు నిర్వహించి, ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు దమ్మన్నపేట పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండ రమేష్ అధ్యక్షతన వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్ధన్నపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సదానందం పాల్గొని బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయునీలను ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. నూతనంగా బదిలీపై పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలుకుతూ, సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు సదానందం మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఏ పాఠశాలకు వెళ్లిన సమయపాలన పాటిస్తూ, అంకితభావంతో విధులు నిర్వహించాలని కోరారు. ఉత్తమ విద్య బోధన తోనే ఉపాధ్యాయులు ప్రత్యేక గుర్తింపు పొందుతారని తెలిపారు. ప్రతీ ఉపాధ్యాయులు పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యావతి, శ్రీనివాసచార్యులు, అరణజ్యోతి, సుదయ్, శ్రీనివాస్, తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ ల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేయాలి

**- పల్లెబోయిన అశోక్, చొప్పరి సోమయ్య**



వర్ధన్నపేట, జులై 12,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజులను బిసి-డి నుంచి బీసీ-ఏ లోకి మార్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ కుమార్ శుక్రవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ముదిరాజులకు ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈనెల 15న, రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మార్వోలకు వినతిపత్రం ఇచ్చే కార్యక్రమానికి శ్రీకరం చుట్టారు. సంబంధించిన పోస్టర్లను ముదిరాజ్ మహాసభ వరంగల్ జిల్లా చీఫ్ ప్రమోటర్ చొప్పరి సోమయ్యతో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ముదిరాజులకు ఉచితంగా పంపిణీ చేసే చేప పిల్లలకు బదులుగా, నగదు బదిలీ చేస్తే ముదిరాజులకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, 1000 కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. చెరువులు, కుంటలపై ముదిరాజులకు సంపూర్ణ హక్కులు కేటాయించాలని కోరారు. త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో ముదిరాజులకు స్థానం కల్పించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు పొన్నం మొగిలి, జిల్లా ప్రధాన కార్యదర్శి నీరోటి సదానందం, నాయకులు కోటి, చెవ్వు కాశీనాథం, అల్లాడి నర్సయ్య, గుండా రాకేష్, భూష సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి వేద పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

**- కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్ కే. శేషు భారతి**



వరంగల్, జులై 12,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ శ్రీ భద్రకాళీ సాంగవేద ఆగమ సంస్కృత విద్యాలయం వేద పాఠశాల ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ఈఓ శేషు భారతి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైదిక స్మార్త ఆగమము, తైత్తరీయ కృష్ణయజుర్వేదాధ్యయనంలో ప్రవేశం కొరకు ఆసక్తి గల విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవని దేవస్థాన కార్యనిర్వహణాధికారి, సహాయ కమీషనర్ కే. శేషు భారతి తెలిపారు. మాతృభాషలో చదవగలిగి, రాయగలిగిన విద్యార్థులు 8 నుండి 12 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఉపనయన సంస్కారం, ఉపాకర్మోత్సర్జనములు పూర్తి ఐనవారు సంధ్యావందనం, అగ్నికార్యం, బ్రహ్మయజ్ఞంలు కంఠస్థం వచ్చినవారు పాఠశాలలో ప్రవేశానికి అర్హులని తెలిపారు. దరఖాస్తు ఫారాలను భద్రకాళీ దేవస్థానం, వరంగల్ వారి వేదపాఠశాల యందు తేది: 13-07-2024 నుండి ఇవ్వబడునని తెలిపారు. విద్యార్థులు పూర్తిచేసిన దరఖాస్తు ఫారాలను 22-07-2024 వరకు వేదపాఠశాల కార్యాలయము వద్ద అందజేయగలరని తెలిపారు.

# హనుమకొండ కలెక్టర్ కి శుభాకాంక్షలు తెలిపిన టెస్కాబ్ చైర్మెన్ మార్నేని రవీందర్ రావు



హన్మకొండ, జులై 12,(జర్నలిస్ట్ వార్త): ఇటీవల నూతనంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ గా పి.ప్రావీణ్య బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం వరంగల్ డిసిసిబి చైర్మన్, తెలంగాణ రాష్ట్ర టెస్కాబ్ చైర్మెన్ మార్నేని రవీందర్ రావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మొక్కను అందించి, స్వాగతం పలికారు.

# ఎస్సీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ ని ఘనంగా సన్మానించిన వర్ధన్నపేట నాయకులు



వర్ధన్నపేట, జులై 12,(జర్నలిస్ట్ వార్త): రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగారగారి ప్రీతమ్ ప్రమాణ స్వీకారం సందర్భంగా శుక్రవారం వర్ధన్నపేట మండల నాయకులు వారి నివాసానికి చేరుకున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన నగారగారి ప్రీతమ్ ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా హైదరాబాద్ లోని ప్రీతమ్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సి విభాగం వరంగల్ జిల్లా అధ్యక్షులు నరకుడు వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గుజ్జ రవీందర్ రెడ్డి, బీసీ విభాగం జిల్లా కార్యదర్శి గజ్జెల సదయ్య, మండల మైనారిటీ విభాగం అధ్యక్షులు అక్బర్, గ్రామ పార్టీ అధ్యక్షులు బండారి సతీష్, కాంగ్రెస్ నాయకులు ఐత ప్రవీణ్ కుమార్, మండల మహిళా కాంగ్రెస్ నాయకురాలు తీగల సునీత, ఎస్సి విభాగం మండల ప్రధాన కార్యదర్శి కొండేటి మధుకర్, మండల అధికార ప్రతినిధి కందిక ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కత్తితో దాడికి పాల్పడ్డ యువకుడు



వర్ధన్నపేట, జులై 12,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని సినిమా థియేటర్ లో శుక్రవారం రెండు వర్గాల యువకులు ఘర్షణ పడ్డారు. స్థానికుల కథనం ప్రకారం జరిగిన ఘటనలో కృష్ణ అనే యువకుడు కత్తితో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. దీంతో విజయ్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన యువకుడు తొర్రూరు అమ్మపురం గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. జరిగిన ఘటన గమనించిన థియేటర్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు జరిగిన ఘటనపై విచారణ చేపట్టారు. కత్తితో దాడికి పాల్పడిన కృష్ణ వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందినవారుగా గుర్తిస్తున్నారు. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది..

# రాయదుర్గంలో టీ-స్క్వేర్ నిర్మాణానికి టెండర్లను ఆహ్వానించిన టీజీఐఐసీ



**హైదరాబాద్ జులై 12,(జర్నలిస్ట్ వార్త):** రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీ సమీపంలో టీ-స్క్వేర్ నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర పరిశ్రమ మౌలిక సదుపాయాల సంస్థ ఆధ్వర్యంలో టీ-స్క్వేర్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ మేరకు టీజీఐఐసీ టెండర్లను ఆహ్వానించింది. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా టీ-స్క్వేర్ను నిర్మించనున్నారు. అలాగే, స్థానిక ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించేలా నిర్మాణం ఉండాలని నిర్ణయించారు. రోజూవారీ పనులతో తీరిక లేకుండా గడిపే వారికి టీ-స్క్వేర్లో జరిగే ఈవెంట్లతో ఆహ్లాద వాతావరణం కల్పించాలని భావిస్తున్నారు. ఇక్కడ టీజీఐఐసీ భారీ ప్లాజాను నిర్మించనుంది. ఈ మేరకు అర్హులైన కాంట్రాక్టర్లను ఎంపిక చేసేందుకు టీజీఐఐసీ కసరత్తు చేస్తోంది.

# పోక్సో కేసులో ఎడియూరప్పకు ఊరట



**హైదరాబాద్ జులై 12,(జర్నలిస్ట్ వార్త):** తనపై నమోదైన పోక్సో కేసును కొట్టివేయాలని కోరుతూ కర్నాటక మాజీ ముఖ్యమంత్రి బిఎస్ ఎడియూరప్ప దాఖలు చేసిన పిటిషన్పై విచారణను జులై 26వ తేదీకి వాయిదా వేసిన కర్నాటక హైకోర్టు జులై 15న బెంగళూరు కోర్టులో జరిగే విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి ఆయనకు మినహాయింపు ఇచ్చింది. జులై 15న తమ ఎదుట హాజరు కావాలని 81 సంవత్సరాల ఎడియూరప్పను ఆదేశిస్తూపోక్సో చట్టం కింద నమోదయ్యే కేసులపై విచారణ జరిపే ఫాస్ట్ ట్రాక్ కోర్టు జులై 4న సమన్లు జారీచేసింది. కేసును దర్యాప్తు చేస్తున్న సిఐడి ఫాస్ట్ ట్రాక్ కోర్టులో జూన్ 27న ఎడియూరప్పపై చార్జిషీట్ దాఖలు చేసింది. తన 17 ఏళ్ల కుమార్తెపై ఎడియూరప్ప ఈ ఏడాది ఫిబ్రవరి 2న డాలర్ల కాలనీలోని తన ఇంట్లో లైంగిక దాడి జరిపినట్లు ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఈ కేసును ప్రభుత్వం సిఐడికి బదిలీ చేసింది.

# డ్రైవింగ్ లైసెన్స్ పరీక్ష మరింత కఠినం..

**హైదరాబాద్ జులై 12,(జర్నలిస్ట్ వార్త):** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియను ఆధునీకరించాలని ఆర్టీఏ అధికారులు నిర్ణయించారు. అందుకోసం ప్రస్తుతం కొనసాగుతున్న మ్యానువల్ విధానం కంటే.. మరింత ప్రామాణికంగా డ్రైవింగ్ పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. డ్రైవింగ్పై పూర్తి అవగాహన లేకుండా డ్రైవింగ్ లైసెన్స్ పొందే వారిని అడ్డుకునేందుకు ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. అయితే, అందుబాటులోకి తీసుకురానున్న కొత్త పద్ధతిలో రహదారులపై నిత్యం ఎదురవుతున్న ఇబ్బందులను టెస్ట్ ట్రాక్పై కృత్రిమంగా కల్పిస్తారు. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్లు తప్పని సరిగా పరీక్ష రాయాల్సిందే. ట్రాక్ మీద వాహనం నడిపిన తర్వాతే లైసెన్స్ పొందుతారు. అయితే, ట్రాక్ మీద వాహనం నడిపేటప్పుడు కంప్యూటర్లో రికార్డవుతుంది. ఏదైనా చిన్న తప్పు చేసినా.. పరీక్ష ఫెయిల్ అయినట్టే.

%కొత్తగా ఆర్టీఏ అమలు చేయబోయే ఆటోమేటిక్



డ్రైవింగ్ టెస్ట్ లో 5 ట్రాక్లు ఏర్పాటు చేస్తారు. ముందుగా %ఎ% ట్రాక్లో ఆర్టీఏ ప్రమాణాల్లో పేర్కొన్న విధంగా వాహనాన్ని రివర్స్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత %బా% అనే ట్రాక్లో ఒక మూల నుంచి మరో మూలకు వెహికల్ను టర్న్ చేయాలి. అలాగే %ఖ% అనే ట్రాక్లో బాగా మలుపులు, ఎత్తుపల్లాలు, ఎత్తయిన ప్రదేశాలు, చిన్న లోయలు వంటి ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తారు. ఆ ట్రాక్లో వాహనాన్ని నడిపి.. చివరగా బండిని పార్కింగ్ చేసి చూపించాల్సి ఉంటుంది.

%ఈ ప్రక్రియ అంతా కంప్యూటర్లో రికార్డవుతుంది. ఏ చిన్న మిస్టేక్ చేసినా టెస్ట్లో ఫెయిల్ అయినట్టు చూపిస్తుంది. ఒకవేళ పరీక్షలో ఫెయిల్ అయితే మరో నెల పాటు శిక్షణ తీసుకుని మళ్లీ రమ్మంటారు. పూర్తి కంప్యూటరీకరణ కావడంతో ఇక్కడ అధికారులు, సిబ్బంది నిర్వహణకు అవకాశం ఉండదని.. బ్రోకర్లకు కూడా అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు.

# మాజీ సిఎం జగన్పై హత్యాయత్నం కేసు నమోదు

**గుంటూరు జులై 12,(జర్నలిస్ట్ వార్త):** మాజీ సిఎం జగన్పై హత్యాయత్నం కేసు నమోదైంది. ఉండి టిడిపి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజును కస్టోడి యల్ టార్చర్ పెట్టిన ఘటనలో ఈ కేసును నమోదు చేశారు. సెక్షన్ 120బి, 166, 167, 197, 307, 326, 465, 508 (34) కింద కేసు నమో దు చేశారు. రఘురామకృష్ణరాజు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గుంటూరు జిల్లా నగరంపాలెం పీఎస్లో కేసు నమోదయింది. కస్టడీ సమయంలో తనపై హత్యాయత్నం చేశారని రఘురామకృష్ణంరాజు తన పిటిషన్లో ఆరోపించారు. ఈ కేసులో జగన్ను ఎ3గా పోలీసులు పేర్కొన్నారు. ఎ1గా సిఐడి మాజీ డిజి సునీల్ కుమార్, ఎ2గా మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ సీతారామాంజనేయులు, ఎ4 గా అప్పటి సిఐడి అడిషనల్ ఎస్పి విజయపాల్, %బా%5గా డాక్టర్ ప్రభావతిలను చేర్చారు. వీరితో పాటు మరికొందరి పేర్లను ఎఫ్ఐఆర్లో చేర్చారు. జగన్ అధికారం కోల్పోయాక నమోదైన తొలి కేసు ఇది. 2021 మే



14 జరిగిన ఘటనపై నిన్న రఘురామరాజు ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. జగన్ మోహన్ రెడ్డి ఒత్తిడి మేరకే తనను అక్రమంగా అరెస్ట్ చేశారని వెల్లడించారు. కస్టడీలో తనను తీవ్రంగా హింసించారని, తనకు బైపాస్ సర్జరీ జరిగిందని చెప్పినప్పటికీ, తన ఛాతీపై కూర్చొని తనను చంపడానికి ప్రయత్నం చేశారని, ఫోన్ పాస్ వర్డ్ చెప్పాలని కొట్టారని ఆరోపించారు. తనకు చికిత్స చేసిన జిజి హెచ్ డాక్టర్ ప్రభావతిపై కూడా ఆయన ఫిర్యాదులో చేశారు. పోలీసుల ఒత్తిడితో తప్పుడు మెడికల్ రిపోర్టులు ఇచ్చారని వెల్లడించారు. జగన్ను విమర్శిస్తే చంపుతామని సునీల్ కుమార్ బెదిరించారని వెల్లడించారు. తనను అక్రమంగా అరెస్టు చేసి వేధించారని, ఐదుగురు ఆగంతుకులతో దారుణంగా హింసించి, వీడియో తీసి అప్పటి సిఎం జగన్ మోహన్ రెడ్డికి చూపించారని రఘురామకృష్ణరాజు తెలిపారు. తప్పుడు రిపోర్టు కోసం డాక్టర్లను కూడా మార్చేసిన పరిస్థితి నెలకొందని, అన్ని డాక్యుమెంట్లు తన వద్ద ఉన్నాయని ఆయన వెల్లడించారు. జగన్, సునీల్ ఇద్దరూ కలిసి తనపై కుట్ర పన్నారని ఆరోపించారు. ఎంతటి వారైనా తప్పు చేస్తే శిక్ష తప్పదనేది రుజువవుతుందని తెలిపారు. తనపై కేసు నమోదుపై సిఐడి మాజీ డిజి సునీల్ కుమార్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ 'సుప్రీం కోర్టులో మూడేళ్ల నడిచి సాక్ష్యాత్తూ సుప్రీంకోర్టు తిరస్కరించిన కేసులో కొత్తగా ఎఫ్ఐఆర్ వేయడాన్ని ఏమనాలో మీ విజ్ఞతకే వదిలేస్తున్నాను' అని అన్నారు.

# 'రాజ్యాంగ హత్య దినం'గా జూన్ 25 ప్రకటనపై కాంగ్రెస్ విమర్శ

**హైదరాబాద్ జులై 12,(జర్నలిస్ట్ వార్త):** జూన్ 25ను 'రాజ్యాంగ హత్య దినం'గా ప్రకటించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ శుక్రవారం ఆక్షేపించింది. ప్రధాని నరేంద్ర మోడీ 'కాపట్యంతో పతాక శీర్షిక రాబట్టేందుకు చేసిన మరొక విన్యాసం'గా కాంగ్రెస్ విమర్శించింది. 1975లో ఎమర్జన్సీ విధించిన రోజు జూన్ 25నే 'రాజ్యాంగ హత్య దినం'గా పాటించనున్నట్లు కేంద్ర హెూమ్ శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించిన తరువాత కాంగ్రెస్ ఆ విధంగా స్పందించింది. ఆత్యయిక స్థితిలో అమానుష వ్యథకు గురైన వారి 'భారీ సేవలు' గుర్తు పెట్టుకోవడానికి అమిత్ షా 'రాజ్యాంగ హత్య దినం' ప్రకటన చేశారు. 'జీవ



సంబంధంలేని ప్రధాని కాపట్యంతో పాల్పడిన మరొక పతాక శీర్షిక రాబట్టే విన్యాసం అది. జూన్ 4న భారత ప్రజలు తనకు నిర్ణయాత్మక వ్యక్తిగత, రాజకీయ, నైతిక పరాజయం చేకూర్చడానికి ముందు పది సుదీర్ఘ సంవత్సరాల పాటు అప్రకటిత ఆత్యయిక స్థితిని ఆయన విధించారు. జూన్ 4 మోడీ ముక్తి దినంగా చరిత్రలో నిలచిపోతుంద' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్ల ఇన్చార్జి) జైరామ్ రమేష్ విమర్శించారు. 'భారత రాజ్యాంగం, దాని సూత్రాలు, విలువలు, వ్యవస్థలపై పద్ధతిప్రకారం దాడి జరిపిన జీవ సంబంధం లేని ప్రధాని ఆయన' అని రమేష్ 'ఎక్స్' పోస్ట్లో పేర్కొన్నారు. 'జీవ సంబంధం లేని ఆ ప్రధాని సైద్ధాంతిక కుటుంబం మనుస్మృతి నుంచి స్ఫూర్తి పొందలేదనే కారణంగా 1949 నవంబర్లో భారత రాజ్యాంగాన్ని తిరస్కరించింది. జీవ సంబంధం లేని ఆ ప్రధానికి ప్రజాస్వామ్యం అంటే ప్రజల గద్దె (డెమా కుర్సీ)' అని రమేష్ వ్యాఖ్యానించారు.

# కేజ్రీవాల్కు మధ్యంతర బెయిల్ అయినా జైల్లోనే

**ఢిల్లీ: జులై 12,(జర్నలిస్ట్ వార్త):** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. కేజ్రీవాల్కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్కు కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కానీ మరోవైపు సిబిఐ కేసులో కేజ్రీవాల్కు ఇంకా బెయిల్ రాకపోవడంతో ఆయన కస్టడీలోనే కొనసాగనున్నారు. కేజ్రీవాల్ పిటిషన్ను విస్తృత ధర్మాసనానికి జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం బదిలీ చేసింది. అరెస్టును సవాలు చేస్తూ కేజ్రీవాల్ వేసిన పిటిషన్పై విచారణ విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసింది. మనీలాండరింగ్ కేసులో బెయిల్ వచ్చినా కేజ్రీవాల్ తీహార్ జైలులోనే ఉన్నారు. గత నెల 27 నుంచి మద్యం విధానం కేసులో ఆయన సిబిఐ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. సిఎం బాధ్యతల




నుంచి తప్పుకునే విషయంలో న్యాయస్థానం ఎలాంటి ఆదేశాలివ్వలేదని సుప్రీంకోర్టు తెలిపింది. అరెస్టు చేసినందున సిఎం పదవి నుంచి దిగిపోవాలా లేదా అనే నిర్ణయం ఆయన ఇష్టమని పేర్కొంది. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధిగా సిఎంగా కేజ్రీవాల్ ఉన్నారని కోర్టు వివరించింది. లిక్కర్ పాలసీ కేసులో ఏప్రిల్ 9న ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులను కేజ్రీవాల్ సవాల్ చేసిన విషయం తెలిసిందే. కేజ్రీవాల్, ఇడి వాదనల అనంతరం మే 17కు తీర్పును సుప్రీం రిజర్వ్ చేసింది. జూన్ 20న కేజ్రీవాల్కు రౌస్ అవెన్యూ కోర్టు సాధారణ బెయిల్ మంజూరు చేసింది. సాధారణ బెయిల్పై మరుసటి రోజు ఢిల్లీ హైకోర్టు స్టే ఇచ్చింది. రౌస్ అవెన్యూ కోర్టు బెయిల్ ఆదేశాలపై 25న ఢిల్లీ హైకోర్టు స్టే ఉత్తర్వులు జారీచేసిన విషయం విధితమే. అ తరువాత కేజ్రీవాల్ను సిబిఐ అరెస్టు చేసినట్లు ప్రకటించింది. గత నెల 27న కేజ్రీవాల్ను అరెస్టు చేసి కోర్టు ముందు సిబిఐ హాజరుపరిచింది.



# ఓటీటీలోకి ఎంట్రీ ఇస్తున్న త్రిష.. 'బృందా' రిలీజ్ డేట్ ఫిక్స్


తమిళ స్టార్ హీరోయిన్ త్రిష ఓటీటీలోకి ఎంట్రీ ఇవ్వబోతుంది. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తొలి వెబ్‌సిరీస్ 'బృందా' సూర్య వంగల ఈ వెబ్ డ్రామాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రముఖ ఓటీటీ వేదిక సోని లివ్‌లో నేరుగా విడుదల కానున్న ఈ వెబ్ సిరీస్‌కు సంబంధించి మేకర్స్ రిలీజ్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సిరీస్‌ను ఆగస్టు 2 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు సోని లివ్ వెల్లడించింది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది. ఇక తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ, మరాఠీ, బెంగాలీ భాషల్లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కాబోతుంది.క్రైమ్ ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో సాగే కథతో రూపొందిన ఈ సిరీస్‌లో ఇంద్రజిత్ సుకుమారన్, ఆమని, రవీంద్ర విజయ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇక ఈ సిరీస్‌తో పాటు చిరంజీవి నటిస్తున్న విశ్వంభర సినిమాలో, కమల్ హాసన్ 'థగ్ లైఫ్', అజిత్ 'విదా ముయార్చి', మోహన్‌లాల్ 'రామ్' తదితర చిత్రాల్లో నటిస్తుంది త్రిష.

# బాలయ్య, విశ్వక్ బాటలో బెల్లంకొండ?



యువ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ బాలీవుడ్ ప్లాన్స్ బెడిసికొట్టడంతో ఇప్పుడు పూర్తిగా టాలీవుడ్ పైనే ఫోకస్ పెట్టాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా పలు ఆసక్తికరమైన ప్రాజెక్ట్స్ లైన్ లో పెట్టారు. ముందుగా 'టైసన్ నాయుడు' అనే సినిమాని సెట్స్ మీదకు తీసుకొచ్చారు. ఇదొక మాస్ యాక్షన్ ఎంటర్టైనర్. 'భీమ్లా నాయక్' ఫేమ్ సాగర్ కె. చంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. ఇది షూటింగ్ దశలో ఉండగానే ఇటీవలే తన తదుపరి చిత్రాన్ని ప్రారంభించాడు. 'చావు కబురు చల్లగా' ఫేమ్ కౌశిక్ పెగళ్ళపాటి »%BSS% 11' సినిమాకి దర్శకుడు. అయితే ఇప్పుడు శ్రీనివాస్ మరో ప్రాజెక్ట్ కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా టాక్ వినిపిస్తోంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన 12వ సినిమాతో లుధీర్ అనే కొత్త దర్శకుడిని ఇండస్ట్రీకి పరిచయం చేయబోతున్నారని తెలుస్తోంది. స్క్రిప్ట్ నచ్చడంతో గత రెండేళ్లుగా టీమ్‌తో కలిసి ప్రయాణం చేస్తున్న యంగ్ హీరో.. ఈ ఏడాదే ఈ సినిమాని పట్టాలెక్కించాలని భావిస్తున్నారట. ఇది బెల్లంకొండ శ్రీనివాస్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్ తెరకెక్కే సినిమా కానుంది. చందు మహేష్, సాయి శశాంక్ దీనికి నిర్మాతలు. ఈ చిత్రానికి "హైందవ" అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నారట. సినీ వర్గాల్లో వినిపిస్తున్న టాక్ ప్రకారం ఈ మూవీలో శ్రీనివాస్ ఒక అఘోరా పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. సాయి శ్రీనివాస్ హీరోగా నిలదొక్కుకోడానికి వేటికవే ప్రత్యేకమైన జోనర్స్ లో సినిమాలు చేస్తున్నారని అర్థమవుతోంది. 'టైసన్ నాయుడు'లో పోలీసాఫీసర్ గా, మునుపెన్నడూ చూడని యాక్షన్ ప్యాక్ రోల్ లో కనిపించబోతున్నారు. అలానే షైన్ స్క్రీన్స్ బ్యానర్ లో కౌశిక్ తో చేస్తున్న సినిమా ఒక హారర్ మిస్టరీ. ఇందులో అతని క్యారక్టర్ కొత్తగా ఉండబోతోంది. ఈ క్రమంలో '%దీూా% 12' చిత్రంలో అఘోరా పాత్రలో నటించే సాహసం చేస్తున్నట్లుగా టాక్ వినిపిస్తోంది. ఇంతకముందు 'అఖండ' సినిమాలో నందమూరి బాలకృష్ణ అఘోరా గెటప్ లో కనిపించి అందరినీ ఆశ్చర్య పరిచారు. త్వరలో 'అఖండ 2' తో మరోసారి అఘోరాగా తిరిగి రాబోతున్నారు. అలానే యువ హీరో విశ్వక్ సేన్ సైతం 'గామి' మూవీలో అఘోర పాత్ర పోషించి ఆకట్టుకున్నారు. ఇలా మన హీరోలు అలాంటి వైవిధ్యమైన పాత్రల్లో నటించిన సినిమాలు ఆడియన్స్ ను ఆకట్టుకోవడమే కాదు, బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలు సాధించాయి. మరి ఇప్పుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కూడా అఘోరా క్యారక్టర్ తో అలరిస్తారేమో చూడాలి. టాలీవుడ్ ప్రొడ్యూసర్ బెల్లంకొండ సురేష్ కొడుకుగా, 'అల్లుడు శీను' సినిమాతో హీరోగా పరిచయమయ్యాడు సాయి శ్రీనివాస్. కెరీర్ ప్రారంభం నుంచీ మాస్ మసాలా సినిమాలతో ఆడియన్స్ కి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నాడు. అయితే చివరగా ఆయన్నుంచి వచ్చిన 'అల్లుడు అదుర్స్' చిత్రం నిరాశ పరిచింది. ఇదే క్రమంలో హిందీలో చేసిన 'ఛత్రపతి' రీమేక్ డిజాస్టర్ గా మారింది. దీంతో కాస్త గ్యాప్ తీసుకొని ఇప్పుడు మూడు క్రేజీ ప్రాజెక్ట్స్ తో వస్తున్నారు. యువ హీరో ఈ మూడు సినిమాలను ఒకేసారి షూట్ చేయాలని ప్లాన్ చేస్తున్నారని టాక్.

# బాలకృష్ణను ఘనంగా సన్మానించనున్న చిత్ర పరిశ్రమ



సినీ నటుడిగా బాలకృష్ణ ఈ ఏడాది 50 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నారు. 1974లో వచ్చిన 'తాతమ్మ కల' చిత్రంతో బాలయ్య తన నట జీవితాన్ని ప్రారంభించారు. ఇంత సుదీర్ఘకాలం హీరోగా కొనసాగుతున్న ఏకైన నటుడు ఆయనే కావచ్చేమో. మరోవైపు, ఎమ్మెల్యేగా కూడా ఆయన హ్యాట్రిక్ కొట్టారు. ఒకవైపు సినీరంగం, మరోవైపు రాజకీయరంగంలో సత్తా చాటుతున్న బాలయ్యను సినీపరిశ్రమ ఘనంగా సత్కరించబోతోంది. సెప్టెంబర్ 1న సన్మాన వేడుక జరగనుంది. బాలయ్యను తెలుగు నిర్మాతల మండలి కార్యదర్శి దామోదర ప్రసాద్, నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు సునీల్ నారంగ్, ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ కలిశారు. సన్మాన కార్యక్రమం గురించి ఆయనతో మాట్లాడారు. బాలయ్య కూడా తన సన్మానానికి అంగీకారం తెలిపారు. సన్మాన వేడుకకు టాలీవుడ్, బాలీవుడ్ సహా ఇతర సినీ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరవుతారని సమాచారం.

# స్టన్నింగ్ లుక్‌తో అశ్విన్ బాబు శివం భజే రిలీజ్ అప్‌డేట్





%హ్పా్రఅఝుఎ దీష్ఘుయివ% ఎ హిడింబ సినిమాతో మంచి హిట్టందుకున్నా టాలీవుడ్ నటుడు అశ్విన్ బాబు ఈ టాలెంటెడ్ యాక్టర్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న తాజా చిత్రం శివం భజే అప్సర్ దర్శకత్వం వహిస్తున్నాడు. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్ అర్బాజ్ ఖాన్ కీ రోల్ పోషిస్తున్నాడు. దిగంగనా సూర్యవంశీ హీరోయిన్‌గా నటిస్తున్నది. తాజాగా ఈ మూవీ నుంచి సరికొత్త లుక్ రిలీజ్ చేసి సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నారు.భయానకంగా ఉన్న కన్ను లుక్ కనిపిస్తుండగా.. బ్యాక్ డ్రాప్‌లో ఇండియా మ్యాప్‌ను చూడొచ్చు. ఈ చిత్రం విడుదల తేదీని ఇవాళ సాయంత్రం 5:05 గంటలకు ప్రకటించనున్నట్టు తెలియజేశారు. న్యూ ఏజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా కామెడీ, డ్రామా, థ్రిల్లర్ అంశాలతో సాగే ఈ మూవీ షూటింగ్ దాదాపు పూర్తయినట్టేనని ఇన్ సైడ్ టాక్. ఈ మూవీలో హైపర్ ఆది, సాయిధీన, తులసి, దేవిప్రసాద్, అయ్యప్ప శర్మ తదితరులు కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి దాశరథి శివేంద్ర కెమెరామెన్ కాగా.. వికాస్ బడిస సంగీతం అందిస్తున్నారు.

# ఫిలింపేర్ అవార్డులన్నీ ఆర్ఆర్ఆర్‌కే



హైదరాబాద్: 2023 సంవత్సరానికి 68వ సౌత్ ఫిలింపేర్ అవార్డులను ప్రకటించారు. ఫిలింపేర్ అవార్డులు ఆర్ఆర్ఆర్, సీతారామం సినిమాలు దక్కించుకున్నాయి. తెలుగులో ఉత్తమ చిత్రంగా ఆర్ఆర్ఆర్‌కు రాగా ఉత్తమ దర్శకుడు రాజమౌళి దక్కింది. ఉత్తమ నటుడు రామచరణ్, జూనియర్ ఎన్‌టిఆర్, ఉత్తమ నటి మృణాల్ ఠాకూర్‌ను వరించింది. విరాట్ పర్వం సినిమాలో నటించిన సాయిపల్లవికి ఉత్తమ నటి క్రిటిక్స్ విభాగం, ఉత్తమ సహాయ నటిగా నందితా దాస్‌కు అవార్డు వరించింది.

ఉత్తమ చిత్రం ఆర్ఆర్ఆర్
ఉత్తమ దర్శకుడు రాజమౌళి (ఆర్ఆర్ఆర్)
ఉత్తమ నటులు రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ (ఆర్ఆర్ఆర్)
ఉత్తమ నటి మృణాల్ ఠాకూర్ (సీతారామం)
ఉత్తమ సంగీత దర్శుడు కీరవాణి (ఆర్ఆర్ఆర్)
ఉత్తమ గేయ రచయిత సిరివెన్నెల సీతారామ శాస్త్రి (సీతారామం)
ఉత్తమ గాయకుడు కాల భైరవ (ఆర్ఆర్ఆర్ కొమరం భీముడో)
ఉత్తమ గాయని (ఫిమేల్) చిన్మయి శ్రీపాద (సీతారామం)
ఉత్తమ చిత్రం (క్రిటిక్స్) సీతారామం
ఉత్తమ నటుడు (క్రిటిక్స్) దుల్కర్ సల్మాన్ (సీతారామం)
ఉత్తమ నటి (క్రిటిక్స్) సాయి పల్లవి ( విరాట పర్వం)
ఉత్తమ సహాయ నటుడు రానా (భీమ్లా నాయక్)
ఉత్తమ సహాయ నటి నందితా దాస్ (విరాట పర్వం)
ఉత్తమ సినిమాటోగ్రఫీ సెంథిల్, రవి వర్మన్
ఉత్తమ ప్రోడక్షన్ డిజౌన్ సాబు సిరిల్ (ఆర్ఆర్ఆర్)



# 'కమిటీ కుర్రోళ్ళు' నుంచి 'సందడి సందడి' లిరికల్ సాంగ్ రిలీజ్ చేసిన విష్వక్సేన్




నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. సినిమాకు యదు వంశీ దర్శకుడు. తాజాగా ఈ చిత్రం నుంచి 'సందడి సందడి' అనే సాంగ్ ను చిత్రబృందం టాలీవుడ్ యువ కథానాయకుడు విష్వక్సేన్ చేతుల మీదుగా విడుదల చేసింది.

జాతర నేపథ్యంలో వచ్చే ఈ సాంగ్ కు ఆడియన్స్ నుంచి విశేష స్పందన వస్తోంది. ఈ హుషారైన గీతానికి మ్యూజిక్ డైరెక్టర్ అనుదీప్ దేవ్ బాణీలు అందించగా... సింహాచలం మన్నె సాహిత్యం సమకూర్చారు. ఆగస్టులో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు మేకర్లు ప్లాన్ చేస్తున్నారు. ఇందులో సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ రాచిరాజు, త్రినాథ్ వర్మ, ప్రసాద్ బెహరా, మణికంఠ పరసు, లోకేశ్ కుమార్ పరిమి, శ్యామ్ కళ్యాణ్, రఘువరన్, శివకుమార్ మట్ట, అక్షయ్ శ్రీనివాస్, రాధ్య, తేజస్వి రావు, టీనా శ్రావ్య, విషిక తదితరులు నటించారు.